సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
బుధవారం | 13 | నవంబర్ | 2024



సూక్ష్మ శివలింగం


తుని: కార్తిక మాసం సందర్భంగా తునికి చెందిన స్వర్ణకారుడు కె.కోటేశ్వరరావు 100 మిల్లీగ్రాముల బంగారంతో సూక్ష్మ శివలింగాన్ని రూపొందించారు. ఇది అందరినీ ఆకట్టుకుంటోంది.



మరిడమ్మకు వెండి వడ్డాణం

పెద్దాపురం: మరిడమ్మ అమ్మవారి ఉత్సవ మూర్తికి గేదెల వీర వెంకట సూర్య కిరణ్, నిహారిక దంపతులు (పెద్దాపురం) మంగళవారం 167 గ్రాముల వెండి వడ్డాణం సమర్పించారు.

22 వేల క్యూసెక్కుల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి మంగళవారం సాయంత్రం 22,392 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. బ్యారేజీ నీటిమట్టం 10.10 అడుగులకు చేరింది. డెల్టా కాలువలకు 3,600 క్యూసెక్కుల నీరు వదిలారు.

న్యూస్‌రీల్

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో ప్రతిభ



దేవిని అభినందిస్తున్న సర్పంచ్ ప్రసాద్, పాఠశాల సిబ్బంది

అయినవిల్లి: విజయనగరం జిల్లా భోగాపురంలో ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో నేదునూరు జెడ్పీ హైస్కూల్‌లో ఎనిమిదో తరగతి చదువుతున్న కంకిపాటి దేవి ప్రతిభ కనబరిచింది. డిసెంబర్‌లో జరిగే స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జాతీయ స్థాయి అండర్– 14 వాలీబాల్ జట్టులో ఆమె ఏపీ తరఫున ఆడేందుకు అర్హత సాధించింది. ఆమెను పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు అభినందించారు.

జీతాలు అందించి ఆదుకోండి

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సిబ్బంది వేడుకోలు



జిల్లా సహకార అధికారికి వినతిపత్రం ఇస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాల సిబ్బంది

అమలాపురం టౌన్: జిల్లాలో గత రబీ సీజన్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేసిన టెక్నికల్ అసిస్టెంట్లు (టీఏ), డేటా ఎంట్రీ ఆపరేటర్లు (డీఈఓ), హెల్పర్లకు కూటమి ప్రభుత్వం నేటి వరకూ జీతాలు ఇవ్వలేదు. రబీ సీజన్ పూర్తయి ఐదు నెలలు గడుస్తున్నా సొమ్ము అందించలేదు. చేసేది లేక ఆయా ప్రాంతాల సిబ్బంది సంబంధిత శాఖ అధికారులకు వినతిపత్రాలు ఇచ్చి, తమకు జీతాలు ఇచ్చి ఆదుకోండని విజ్ఞప్తి చేస్తున్నారు. గత ప్రభుత్వంలో ఏర్పాటైన 300 రైతు భరోసా కేంద్రాల ద్వారా సుమారు 900 మంది సిబ్బంది ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఆ రెండు నెలల కాలానికి గాను సిబ్బందికి జీతాలు ఇవ్వడంలో ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తుంది. ఇలాగైతే తమ కుటుంబ పోషణ ఎలా సాగాలని వారు ప్రశ్నిస్తున్నారు. గత రబీ సీజన్‌లోని పెండింగ్ జీతాలు ఇస్తేనే ఇప్పటి ఖరీఫ్‌లో రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్ల విధులకు హాజరవుతామని వారు తెగేసి చెబుతున్నారు. జిల్లా సహకార అధికారులకు ఆయా మండలాల టీఏలు, డీఈఓలు, హెల్పర్లు వినతి పత్రాలు అందిస్తూ అల్టిమేటమ్‌ను స్పష్టం చేస్తున్నారు. ఉప్పలగుప్తం మండలానికి చెందిన ధాన్యం కొనుగోలు కేంద్రాల టీఏలు, డీఈవోలు, హెల్పర్లు అమలాపురంలోని జిల్లా సహకార శాఖ కార్యాలయానికి మంగళవారం చేరుకుని జీతాలు అందని తమ పరిస్థితిపై ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా సహకార అధికారి ఎస్.మురళీకృష్ణకు తమ ఆవేదనతో కూడిన వినతి పత్రాన్ని అందించారు.

రేపు సెపక్‌తక్రా క్రీడాకారుల ఎంపిక

అమలాపురం రూరల్: కర్నూలు జిల్లా నందికొట్కూరులో ఈ నెల 26, 27 తేదీల్లో రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ సెపక్‌తక్రా పోటీలు జరగనున్నాయి. ఇందులో పాల్గొనే జిల్లా సబ్ జూనియర్ బాల, బాలికల జట్టు ఎంపిక పోటీలు అమలాపురం ఎస్‌కేబీఆర్ కళాశాలలో ఈ నెల 14న జరుగుతాయని సెపక్‌తక్రా జిల్లా అధ్యక్షుడు జవ్వాది తాతబాబు, కార్యదర్శి కేతా సాయి దుర్గాప్రసాద్ తెలిపారు. క్రీడాకారులు వయసు ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, రెండు ఫొటోలు తీసుకురావాలన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జిల్లా జట్టుకు ఎంపిక చేస్తామని కోచ్ యాండ్ర గౌతమ్ తెలిపారు. మరిన్ని వివరాలకు 85199 98997 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

15న కార్తిక పౌర్ణమి పూజలు

రాయవరం: మండలంలోని వెదురుపాక విజయదుర్గా పీఠంలో ఈ నెల 15న కార్తిక పౌర్ణమి పూజలను ఘనంగా నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు మంగళవారం తెలిపారు. కార్తిక పౌర్ణమి, శుక్రవారం పురస్కరించుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నామని అన్నారు. మహిళలచే అమ్మవారికి సామూహిక శ్రీచక్ర కుంకుమార్చనలు ఉంటాయన్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు ఆయన వివరించారు.

ఖరీఫ్.. ఉఫ్

- గణనీయంగా తగ్గిన దిగుబడి
- జిల్లాలో 1.63 లక్షల ఎకరాల్లో సాగు
- ముంపు మండలాల్లో మునిగిన వరి చేలు
- తీర ప్రాంత మండలాల్లో దిగుబడి 20 నుంచి 25 బస్తాలే
- కొన్నిచోట్ల 15 బస్తాలు వచ్చే అవకాశం



ఉప్పలగుప్తంలో వర్షాలకు నీట మునిగిన వరి చేలు

సాక్షి, అమలాపురం: రైతులకు ఖరీఫ్ చేదు ఫలితాలను మిగుల్చుతోంది. లాభాలు దేవుడెరుగు కనీసం పెట్టుబడులు వస్తే చాలన్నట్టుగా ఉంది.. ఖరీఫ్ సీజన్‌లో అసాధారణంగా కురిసిన వర్షాలతో ఆశించిన స్థాయిలో దిగుబడులు రాక రైతులు నష్టపోయే పరిస్థితి వచ్చింది. మరీ ముఖ్యంగా తీర ముంపు ప్రాంతాల్లో రైతులు తీవ్రంగా నష్టపోయారు.

జిల్లాలో 1.63 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ వరి సాగు జరిగింది. గోదావరి డెల్టాలో ఖరీఫ్ సగటు దిగుబడి 29 బస్తాలు (బస్తా 75 కిలోలు– 21.75 క్వింటాళ్లు). కానీ ఈసారి ఆ స్థాయిలో దిగుబడి కేవలం కొన్ని ప్రాంతాలకు మాత్రమే పరిమితం కానుంది. జిల్లాలో ఆలమూరు, కొత్తపేట **వ్యవసాయ సబ్ డివిజన్ల పరిధిలో మాత్రమే 32 బస్తాల నుంచి 35 బస్తాల వరకూ దిగుబడి వస్తోంది. రామచంద్రపురం, పి.గన్నవరం సబ్ డివిజన్లలో 25 బస్తాల నుంచి 28 బస్తాల వరకూ దిగుబడి వస్తోంది. కానీ అమలాపురం, రాజోలు, పి.గన్నవరం వ్యవసాయ సబ్ డివిజన్ల పరిధిలో మూడొంతుల ప్రాంతాల్లో మాత్రం దిగుబడి 15 బస్తాల నుం**చి 20 బస్తాలకు మించి వచ్చే అవకాశం లేదని రైతులు చెబుతున్నారు. ఈ వ్యవసాయ డివిజన్లలో ఉప్పలగుప్తం, అల్లవరం, సఖినేటిపల్లి, మలికిపురం, కాట్రేనికోన మండలాల పరిధిలో సముద్ర తీరాన్ని ఆనుకుని ఉన్న గ్రామాల్లో వరి బాగా దెబ్బతింది. ఈ ప్రాంతంలో సుమారు 41,150 ఎకరాల్లో వరి సాగు జరుగుతోందని అంచనా. ఇక్కడ సగటు దిగుబడిలో కేవలం సగం మాత్రమే సొమ్ము వచ్చే అవకాశం కనిపిస్తోంది. దీనితో రైతులు ఖంగుతిన్నారు. కనీస పెట్టుబడులు కూడా రావని, వస్తున్న దిగుబడిలో తాలు, తప్పలు అధికంగా వచ్చే అవకాశముందని రైతులు ఆందోళన చెందుతున్నారు. పైగా ఇక్కడ సాగుకు రైతులు అదనంగా పెట్టుబడి పెట్టారు. నారుమడుల దశ నుంచి పలు సందర్భాల్లో వర్షాలకు వరిచేలు నీట మునిగాయి. ముంపు చేల నుంచి మోటార్లతో నీరు బయటకు తోడాల్సి వచ్చింది. అయినా చేలు దెబ్బతినడంతో పలువురు రైతులు సాగును కూడా వదిలేశారు.

నష్టాలను చవిచూస్తూ..

అధ్వానంగా మారిన మురుగునీటి కాలువ వ్యవస్థతో మధ్య డెల్టా (కోనసీమలో) ఖరీఫ్ వరి సాగు జూదంగా మారింది. ఇది వరి ఆయకట్టు 1,85,149 ఎకరాలు కాగా, ఈసారి కేవలం 1.63 లక్షల ఎకరాల్లోనే సాగు జరిగింది. అంటే సుమారు 22 వేల ఎకరాల్లో రైతులు సాగుకు దూరంగా ఉన్నారు. సఖినేటిపల్లి, మలికిపురం, ఉప్పలగుప్తం, అల్లవరం మండలాల్లో రైతులు తొలి పంటను స్వచ్ఛందంగా వదిలేస్తున్నారు. మన్నుపై మమకారంతో సాగు చేసిన వారు నష్టాలను చవిచూస్తున్నారు.

భయపెడుతున్న అల్పపీడనం



ఆలమూరు మండలం పెదపళ్లలో బరకాలు దగ్గర పెట్టుకుని మాసూళ్లు చేస్తున్న కూలీలు

నారుమడుల దశ నుంచి వెంటాడుతున్న వర్షాలు చివరకు వరి కోతలు, కుప్ప నూర్పుడుల సమయంలో సైతం వదలడం లేదు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో జిల్లాలో మంగళవారం తెల్లవారుజాము నుంచి రాత్రి వరకూ చెదురు ముదురుగా వర్షం పడింది. దీనితో ఆందోళన చెందుతున్న రైతులు నూర్పుడులు వేగవంతం చేశారు. ముందు జాగ్రత్తగా ధాన్యం, పనలపై బరకాలు కప్పుతున్నారు. జిల్లాలో ఆత్రేయపురం, రావులపాలెం, కొత్తపేట, మండపేట, ఆలమూరు, రామచంద్రపురం, కె.గంగవరం ప్రాంతాల్లో వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి.

వానలే దెబ్బతీశాయి..

సాగు ఆరంభమైన నాటి నుంచి నవంబర్ వరకూ (అక్టోబర్‌లో మినహా) జిల్లాలో అంచనాలకు మించి భారీ వర్షాలు కురిశాయి. జిల్లాలో జూన్‌లో సగటు కన్నా 57.4 శాతం, జూలైలో 41.1 శాతం, ఆగస్టులో 7.8 శాతం, సెప్టెంబరులో 10.5 శాతం అదనంగా వర్షం కురిసింది. అక్టోబర్‌లో మాత్రం సగటు కన్నా 20.7 శాతం తక్కువ వర్షం పడింది. జూలై వర్షాలకు తీర ప్రాంత మండలాల్లో నారుమడులు దెబ్బతినడంతో రైతులు రెండోసారి నారుమడులు వేశారు. ఆగస్టులో వరిచేలు దుబ్బులు చేసే సమయంలో కురిసిన వర్షాలు రైతులను చావుదెబ్బ తీశాయి.

సాగుకు దూరం



నేను రెండెకరాల్లో సార్వా సాగు చేశాను. వర్షాలకు పంట మొత్తం మునిగిపోయింది. మా ప్రాంతంలో శంకరగుప్తం మేజర్ డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా ఉండడంతో చేలు రోజుల పాటు ముంపులో ఉండి కుళ్లిపోయాయి. ఇప్పటికే దీవిలో రైతులు తొలి పంట వదిలేస్తున్నారు. డ్రైనేజీ వ్యవస్థను బాగు చేయకుంటే మిగిలిన వారు సైతం సాగుకు దూరమవుతారు.

– సుందర బుల్లబ్బులు, రైతు, గూడపల్లి, మలికిపురం మండలం

ఆశించిన దిగుబడి రాక..




ఖరీఫ్‌లో 30 బస్తాలు పండినా మా ప్రాంతంలో గిట్టుబాటు కాదు. ఏటా వర్షాలకు వరిచేలు మునిగిపోతున్నాయి. ఈసారి అధిక వర్షాలతో రెండుసార్లు నాట్లు వేయాల్సి వచ్చింది. మేము 12 ఎకరాల్లో 1,318 రకాన్ని సాగు చేశాం. తొలిసారి బెంగాలీ కూలీలతో నాట్లు వేయిస్తే వర్షాలకు మునిగిపోవడంతో రెండోసారి స్థానిక కూలీలతో నాట్లు వేశాం. వర్షాలకు అనుకున్న స్థాయిలో దిగుబడి రాలేదు. ఇప్పుడు పెట్టుబడులు వస్తే చాలా గొప్ప విషయం.

– గుద్దటి నవీన్, రైతు, పెదగాడవిల్లి, ఉప్పలగుప్తం మండలం

ఇంటర్ పరీక్ష ఫీజుకు గడువు పెంపు

- ఈ నెల 21 వరకూ అవకాశం
- డిసెంబర్ 5 వరకూ ఆలస్య రుసుముతో చెల్లించే అవకాశం



సోమశేఖరరావు, డీఐఈఓ

అమలాపురం టౌన్: ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులు పరీక్ష ఫీజు చెల్లించేందుకు తుది గడువును ఈ నెల 21వ తేదీ వరకూ పొడిగిస్తూ ఇంటర్మీడియట్ విద్యా మండలి నిర్ణయించింది. జిల్లాలోని ఇంటర్ చదువుతున్న దాదాపు 27 వేల మంది విద్యార్థుల్లో చాలా మందికి ఈ ప్రకటన వెసులుబాటు కానుంది. వాస్తవానికి ఇంటర్ బోర్డు తొలుత ఫీజు చెల్లింపునకు అక్టోబర్ 21వ తేదీ నుంచి ఈ నెల 11వ తేదీ వరకూ గడువు ప్రకటించింది. కొంతమంది విద్యార్థులు ఫీజులు చెల్లించకపోవడంతో ఈ గడువును పెంచుతూ ఇంటర్ బోర్డు తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 21 వరకూ ఎలాంటి ఫైన్ లేకుండా కేవలం ఫీజు చెల్లించే వెసులుబాటును కల్పించింది. రూ.వెయ్యి ఫైన్‌తో ఫీజు చెల్లించేందుకు గడువును వచ్చే నెల డిసెంబర్ 5వ తేదీ వరకూ ఇచ్చింది. ఇదే ఆఖరి గడువు అని, మరోసారి గడువు పెంచే ఆస్కారం ఉండదని ఇంటర్మీడియట్ బోర్డు స్పష్టం చేసింది. జిల్లాలో 13 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, ఒక ఎయిడెడ్ కళాశాల, సాంఘిక సంక్షేమ శాఖ పరిధిలో 6 గురుకుల పాఠశాలలు, 105 ప్రైవేటు కళాశాలలు ఉన్నాయి. ఈ మొత్తం కళాశాలల్లో ప్రథమ సంవత్సరంలో 13,938 మంది, ద్వితీయ సంవత్సరంలో 13,940 మంది విద్యార్థులు చదువుతున్నారు. పలు అనివార్య కారణాలతో పరీక్ష ఫీజు చెల్లించలేని విద్యార్థులకు ఈ గడువు పొడిగింపు ఎంతో ప్రయోజనకారి కానుంది.

సద్వినియోగం చేసుకోండి

ఇంటర్ బోర్డు పరీక్ష ఫీజు చెల్లింపునకు పెంచిన గడువును జిల్లాలోని విద్యార్థులు తక్షణమే సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ అధికారి (డీఐఈఓ) వనుము సోమశేఖరరావు విజ్ఞప్తి చేశారు. ఇంత వరకూ పరీక్ష ఫీజు చెల్లించని విద్యార్థులు తమ కళాశాలలకు వెళ్లి ఫీజు చెల్లించాలని సూచించారు. అన్ని కళాశాలల్లో ఫీజులు చెల్లించుకునేందుకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారని గుర్తు చేశారు.

'పది'లో వంద శాతం ఉత్తీర్ణతకు కార్యాచరణ



ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం రూరల్: పదో తరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగాలని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ తెలిపారు. మంగళవారం అమలాపురం కలెక్టరేట్‌లో పదో తరగతి విద్యార్థుల వంద రోజుల కార్యాచరణ ప్రణాళికను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాల విద్యతోనే విద్యార్థుల చదువు ఆగిపోకూడదనే ఆలోచనతో, పదో తరగతి పరీక్షల్లో మంచి ఉత్తీర్ణత సాధించేలా ప్రత్యేక కార్యాచరణ చేపడుతున్నామన్నారు. ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులను నిర్వహిస్తూ విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు. పాఠశాలల్లో తరగతుల నిర్వహణ అనంతరం, సాయంత్రం వేళ విద్యార్థులకు అల్పాహారం అందిస్తామన్నారు. విద్యార్థులు పాఠ్యాంశాల్లో పట్టు సాధించేలా పునశ్చరణ తరగతులు పటిష్టంగా నిర్వహించాలన్నారు. ఉపాధ్యాయులు ప్రతి సబ్జెక్టుకు సంబంధించి ప్రత్యేకంగా ప్రశ్నలు రూపొందించి పరీక్షలు పెట్టాలన్నారు. ఉప విద్యాశాఖ అధికారి గుబ్బల సూర్యప్రకాశం, బి.హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపాదనలు చేయండి

రాజమహేంద్రవరం, కాకినాడ నుంచి నేరుగా ఓడలరేవు ప్లాంట్‌కు (ఓఎన్జీసీ) చమురు సంస్థకు చెందిన భారీ వాహనాలు సులభతరంగా చేరుకునే విధంగా అమలాపురం పరిసర ప్రాంతాలు, పట్టణంలో రోడ్లు, వంతెనలు, విస్తరణ కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ మహేష్ కుమార్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో రోడ్డు భవనాల శాఖ, పంచాయతీరాజ్, పురపాలక సంఘం, జలవనరులు, డ్రైనేజీ శాఖల ఇంజినీర్లతో సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం ఉన్న రోడ్లు, వంతెనలు ఓఎన్జీసీ సామగ్రి తరలించే భారీ వాహనాలు రాకపోకలకు ఇబ్బందిగా ఉన్నాయని, సులభతరంగా వాహనాల రాకపోకలకు అనువైన విధంగా వసతుల కల్పనకు ప్రతిపాదనలు చేయాలన్నారు. రెండు రోజుల్లో అంచనాలను ఇవ్వాలన్నారు. రోడ్లు భవనాల శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ బి.రాము, డివిజనల్ ఇంజినీర్ డీవీఎస్ వర్మ, జల వనరుల శాఖ డీఈఈ బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

టెండర్లను పారదర్శకంగా పరిశీలించాలి

సాక్షి, అమలాపురం: జిల్లాలోని ఇసుక రీచ్‌ల కోసం నిర్వహించిన టెండర్ల ప్రక్రియలో ప్రతి అంశాన్ని పూర్తి పారదర్శకతతో పరిశీలించాలని ఇసుక ర్యాంపుపై ఏర్పాటు చేసిన కమిటీ సభ్యులను కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఆదేశించారు. జిల్లాలోని 12 ర్యాంపులకు సంబంధించి సీల్డ్ టెండర్లను 12 కంపెనీలు సమర్పించాయని తెలిపారు. ఆయా కంపెనీల ధ్రువపత్రాలు, టర్నోవర్, కంపెనీల ప్రామాణికత తదితర ఐదు లీగల్ అంశాల అర్హతలను క్షుణ్ణంగా ధ్రువీకరించి నిర్దేశిత ప్రొఫార్మాలో సమర్పించాలని కలెక్టర్ సూచించారు. స్థానిక కలెక్టరేట్‌లోని ఇసుక టెండర్ల బిడ్లు ధ్రువీకరణ కమిటీతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 12 ఇసుక రీచ్‌ల్లో 2025 సంవత్సరం మార్చి 14 వరకూ ఇసుక తవ్వకాలకు టెండర్లు పిలిచామన్నారు. ఈ రీచ్‌లలో ఇసుకను మనుషులతో తీయించాల్సి ఉందని, అక్కడ నుంచి స్టాక్ పాయింట్లకు రవాణా చేయడం, స్టాక్ పాయింట్ల వద్ద వాహనాలలో లోడు చేసేందుకు సీల్డ్ టెండర్లు సమర్పించారన్నారు. సీల్డ్ టెండర్లు సమర్పించిన కంపెనీలు చివరి మూడు ఆర్థిక సంవత్సరాల్లో సాధించిన టర్నోవర్ నివేదికలను క్షుణ్ణంగా ధ్రువీకరించాలన్నారు. సాంకేతికంగా అర్హత సాధించి అతి తక్కువగా ధరలు కోట్ చేసిన వారు రీచ్‌లను నిర్వహించడానికి అనుమతులు ఇస్తామని తెలిపారు. జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, జిల్లా గనులు భూగర్భ శాఖ అధికారి ఎల్.వంశీధర్‌రెడ్డి, జిల్లా రిజిస్ట్రార్ నాగలింగేశ్వరరావు, డ్వామా పీడీ ఎస్.మధుసూదన్, జిల్లా ఆడిట్ అధికారి ఏవీవీ సత్యనారాయణ, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి పి.శివరామకృష్ణ, ఆర్‌అండ్‌బీ జిల్లా అధికారి బి.రాము, జల వనరుల శాఖ డీఈఈ బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

- రోజుకో వినూత్న కార్యక్రమం
- గ్రంథాలయాల పాత్ర, సేవలపై మననం

అమలాపురం టౌన్: సమాజంలో గ్రంథాలయాల పాత్ర, సేవలను మననం చేసుకునేందుకు ఏటా జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా 14 నుంచి జిల్లాలో వారోత్సవాలకు ఏర్పాట్లు చేశారు. జిల్లాల పునర్విభజన జరిగినప్పటికీ కొన్ని శాఖలు ఇంకా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్థాయిలోనే ఉండిపోయాయి. అందులో గ్రంథాలయ శాఖ ఒకటి. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఒక జిల్లా స్థాయి గ్రంథాలయం, 8 ప్రథమ శ్రేణి, 10 ద్వితీయ శ్రేణి, 86 తృతీయ శ్రేణి గ్రంథాలయాలు ఉన్నాయి. ఇవి కాకుండా జిల్లాలో 51 గ్రామీణ గ్రంథాలయాలు, 161 బుక్ డిపాజిట్ సెంటర్లు, 5 మొబైల్ లైబ్రరీలు ఉన్నాయి. వీటన్నింట్లో ఈ నెల 24 నుంచి 20వ తేదీ వరకూ రోజుకో వినూత్న కార్యక్రమాలతో వారోత్సవాలను నిర్వహించనున్నారు. తొలి రోజు అంటే 14న బాలల దినోత్సవం, దేశ మాజీ ప్రధాన మంత్రి జవహర్‌లాల్ నెహ్రూ జయంతి జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. జిల్లా కేంద్రం అమలాపురం ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో ఏటా వారోత్సవాలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించడంలో జిల్లాలోనే ఓ ప్రత్యేకతను సంతరించుకుంటుంది. వీటి నిర్వహణకు కూడా ఆ గ్రంథాలయాధికారి జీవీఆర్ఎస్‌హెచ్‌కే వర్మ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి.



గత ఏడాది అమలాపురం ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో వారోత్సవాలు

కార్యక్రమాలు ఇలా..

ఈ నెల 14న గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం అవుతాయి. గ్రంథాలయ పతాకాల ఆవిష్కరణలు, బాలల దినోత్సవం, జవహర్‌లాల్ నెహ్రూ జయంతి వేడుకలు నిర్వహిస్తారు. 15న గ్రంథాలయాల్లో పుస్తక ప్రదర్శనలు, 16న గ్రంథాలయ ఉద్యమకారుల చరిత్రలపై అధ్యయనం, ఉద్యమకారుల గురించి వక్తల ప్రసంగాలు, 17న కవి సమ్మేళనాలు, 18న గ్రంథాలయాల స్ఫూర్తిని నింపే దిశగా విద్యార్థులకు వివిధ అంశాలపై పోటీలు, 19న మహిళా దినోత్సవ వేడుకలు, మాజీ ప్రధాన మంత్రి ఇందిరాగాంధీ జయంతి వేడుకలు, 20న వారోత్సవాల ముగింపు సభలు, వివిధ పోటీల్లో విజేతలకు బహుమతి ప్రదానోత్సవాలు జరుగుతాయి.

రాష్ట్ర బడ్జెట్ సూపర్ ఫ్లాప్

- ప్రజలను మోసం చేసిన చంద్రబాబు
- మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ధ్వజం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి తదితరులు

రావులపాలెం: సూపర్ సిక్స్ పథకాలు అందిస్తామని ఎన్నికల ముందు ప్రజలను మభ్యపెట్టిన చంద్రబాబు అధికారంలోకి వచ్చాక, ప్రవేశపెట్టిన రాష్ట్ర వార్షిక బడ్జెట్ సూపర్ ఫ్లాప్ అయ్యిందని ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి విమర్శించారు. ఇందులో సూపర్ సిక్స్ పథకాల అమలుకు ఎలాంటి కేటాయింపులు చేయలేదని అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా యాక్టివిస్టులతో ప్లకార్డు ప్రదర్శించి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.2,94,427 కోట్లతో బడ్జెట్ ప్రవేశ పెట్టిందన్నారు. ఏ రాష్ట్రంలో లేని విధంగా రూ.ఏడు వేల కోట్లతో ఖజానాను అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అప్పగిస్తే, ఐదు నెలల పాటు బడ్జెట్ ప్రవేశపెట్టలేని స్థితిలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాలన సాగిందన్నారు. గత ప్రభుత్వంలో రూ.2,53,500 కోట్లతో 23–24 వార్షిక బడ్జెట్ ప్రవేశపెట్టి సుమారు 98 శాతం అన్ని సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. ప్రస్తుతం అంతకంటే ఎక్కువగా బడ్జెట్ ప్రవేశపెట్టినా ఏ పథకానికీ సరైన కేటాయింపులు చేయలేదన్నారు. రాష్ట్రంలో సుమారు కోటి మందికి నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతికి బడ్జెట్లో ఎటువంటి నిధులు కేటాయించ లేదన్నారు. రాష్ట్రంలో 53 లక్షల మంది రైతన్నలు ఉంటే రూ.పది వేల కోట్ల పైన రైతు భరోసాగా ఇవ్వాల్సిన పరిస్థితి ఉంటే, వారికి కేవలం రూ.వెయ్యి కోట్లు ఇచ్చారన్నారు. మహిళలకు నెలకు రూ.1500 ఇస్తామని చెప్పి మోసం చేశారన్నారు. 84 లక్షల మంది తల్లులకు తల్లికి వందనం పేరుతో రూ.12,600 కోట్లు ఖర్చు చేయాల్సి ఉండగా, కేవలం రూ. 5,387 కోట్లు కేటాయించారన్నారు. సంవత్సరానికి మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తామని చెప్పి దానికి సుమారు రూ.4 వేల కోట్లు కేటాయించాల్సి ఉండగా, రూ.895 కోట్లు మాత్రమే ఇచ్చారన్నారు. మహిళలకు ఉచిత బస్సు అమలు ఊసేలేదన్నారు. గడిచిన ఐదు నెలల్లో చంద్రబాబు ప్రభుత్వం ఘోర వైఫల్యం చెందిందన్నారు. అసెంబ్లీలో జరిగే బడ్జెట్ మోసాలపై సోషల్ మీడియాలో ప్రచారం జరిగితే నిజాలు ప్రజలకు తెలిసిపోతాయని, కావాలనే సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్న వారిపై కేసులు పెట్టి ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. పోలవరం ప్రాజెక్టు విషయంలో ఎత్తు తగ్గించి కమీషన్ల కోసం కక్కుర్తి పడ్డారే తప్ప దాని వల్ల రాష్ట్రానికి జరిగే ప్రయోజనం ఏంటో చెప్పాలన్నారు. ఉచిత ఇసుక విధానం టీడీపీ నేతలు జేబులు నింపేందుకే తప్ప, పేదలకు ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. మద్యం విక్రయాల్లో కూడా 25 శాతం రౌడీ వసూళ్లు చేస్తూ అమ్మకాలు చేస్తున్నారన్నారు. ప్రశ్నించడం కోసమే వచ్చిన పవన్ కళ్యాణ్ యువతకు నిరుద్యోగ భృతి సున్నా చేస్తుంటే, అక్కడే ఉండి ఏం చేస్తున్నారో చెప్పాలన్నారు. సమావేశంలో కొత్తపేట ఎంపీపీ మార్గాన గంగాధర్‌రావు, రావులపాలెం జెడ్పీటీసీ సభ్యుడు కుడుపూడి శ్రీనివాసరావు, అముడా మాజీ చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, సర్పంచులు దొమ్మేటి అర్జున్‌రావు, తమ్మన శ్రీను, కప్పల శ్రీధర్, జవ్వాది రవి తదితరులు పాల్గొన్నారు.

టీఈసీసీతో ఆదిత్య యూనివర్సిటీ ఒప్పందం



ఒప్పంద పత్రాలు చూపిస్తున్న టీఈసీసీ ప్రతినిధులు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఆదిత్య యూనివర్సిటీతో తైపీ ఎకనామిక్ అండ్ కల్చరల్ సెంటర్ (టీఈసీసీ) విద్యా విభాగం మంగళవారం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ వివరాలను యూనివర్సిటీ ప్రో చాన్సలర్ ఎస్.సతీష్‌రెడ్డి తెలిపారు. ఈ ఒప్పందంతో సాంస్కృతిక, విద్యా మార్పిడిని పెంపొందించడానికి అవకాశం కలుగుతుందన్నారు. విద్యార్థుల్లో మాండరిన్ భాషా నైపుణ్యాలను పెంపొందించడం, ఉద్యోగావకాశాల కోసం వారి అభ్యాసన అనుభవాన్ని, భాషా నైపుణ్యాలను మెరుగుపరచడానికి వీలు కలుగుతుందని వివరించారు. ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో ఇంటర్నేషనల్ రిలేషన్స్ డీన్ డాక్టర్ పీఎస్ రంజిత్, డివిజన్ డైరెక్టర్ పీటర్స్ చెన్, తైవాన్ రాయబారి భౌషువాన్ గెర్, సీఈఓ శ్రీవిజయ కౌమార్ ఒప్పంద పత్రంపై సంతకాలు చేశారని అన్నారు. ఈ ఒప్పందం ద్వారా తైవాన్ పరిశ్రమలకు ప్రత్యేకమైన విద్యా వనరులు, ఉద్యోగావకాశాలు విద్యార్థులకు లభిస్తాయని తెలిపారు.